క్లుప్తంగా

ఘనంగా మన్యుసూక్త హోమం



దేవాలయంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

మహారాణిపేట: మెయిన్‌రోడ్డు శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో మాఘ పౌర్ణమిని పురస్కరించుకొని మన్యుసూక్త హోమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రతి నెల పౌర్ణమి తిథి నాడు దేవాలయంలో మన్యు సూక్త హోమం నిర్వహిస్తున్నారు. నరఘోష, శత్రు ఘోష, రుణబాధ నివారణ, గ్రహ శాంతి, కార్యసిద్ధి కోసం ఈ హోమం నిర్వహించినట్లు దేవాలయ ఈవో అల్లు జగన్నాథం తెలిపారు.

గుండె జబ్బులపై అప్రమత్తం



వాకర్స్‌కు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ హేమంత్‌కుమార్ బెహరా

అల్లిపురం: గుండె జబ్బుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ముందస్తు జాగ్రత్తలతో గుండె పదిలంగా ఉంచుకోవచ్చని ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ హేమంత్ కుమార్ బెహరా అన్నారు. మెడికవర్ హాస్పటల్స్ సౌజన్యంతో ఆదివారం సరస్వతి పార్కులో హెల్త్ టాక్, హెల్త్ క్యాంపు పేరిట అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండె ఆరోగ్యానికి చేయాల్సిన పనులు, గుండెపై ఒత్తిడి ఎలా వస్తుంది, ఒత్తిడి తగ్గించుకోవడం, వ్యాయామం వల్ల గుండెకు కలిగే రక్షణ, తీసుకోవాల్సిన ఆహారాలు తదితర విషయాలను వివరించారు. కార్యక్రమంలో పార్క్ అధ్యక్షుడు వాడ్రాపు సింహాచలం మూర్తి, రామారావు, శివ, లింగం శ్రీనివాసరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చందనం సమర్పణకు రూ.లక్ష విరాళం



సూపరింటెండెంట్‌కు నగదు అందజేస్తున్న దాత

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి చందనం సమర్పణ నిమిత్తం ఆదివారం నగరంలోని పిఠాపురం కాలనీకి చెందిన ఇమంది లక్ష్మీప్రసాద్ రూ. లక్ష విరాళం ఇచ్చారు. సంబంధిత విరాళాన్ని ఆలయంలో సూపరింటెండెంట్ శ్రీనివాసరావుకు నగదురూపంలో అందజేశారు. దాతకు స్వామి దర్శనం కల్పించి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం ఉద్యోగి నాయుడు పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన



వడ్డన చేస్తున్న శరగడం చిన అప్పలనాయుడు

సింహాచలం: జీవీఎంసీ 96వవార్డు రాజుచెరువు ప్రాంతంలోని శ్రీ భూలోకమాంబ తీర్థ మహోత్సవం పురస్కరించుకుని ఆదివారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు శరగడం చిన అప్పలనాయుడు ప్రారంభించారు. భక్తులకు వడ్డన చేశారు. కార్యక్రమంలో శరగడం అప్పారావు, పెతకంశెట్టి సంజీవి, శరగడం రామకృష్ణ, పెతకంశెట్టి మహాలక్ష్మినాయుడు, శరగడం శ్రీను, ఆళ్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యనారాయణమూర్తికి ప్రత్యేక పూజలు

మాఘపౌర్ణమి సందర్భంగా భాస్కరుడికి ప్రత్యేక పంచ హారతులు



విశేష అలంకరణలో ఉషా, ఛాయా సమేత శ్రీ సూర్యనారాయణమూర్తి

అల్లిపురం: వెంకటేశ్వరమెట్టపై అలమేలు మంగమ్మ ఆలయంలో వెలసిన శ్రీ సూర్యనారాయణమూర్తి దేవాలయంలో మాఘ మాసం మూడవ ఆదివారం, పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు పాణంగిపల్లి కేశవాచార్యులు ఆధ్వర్యంలో మూలవిరాట్టుకు ప్రత్యేకంగా గోక్షీరంతో అభిషేకం, పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం మందార, చామంతి, గులాబి పుష్పాలతో స్వామి వారిని విశేషంగా అలంకరించారు. ఉషా ఛాయా సమేత సూర్యనారాయణ స్వామికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. తొలుత మాఘ పౌర్ణమి ఆదివారం సందర్భంగా దేవాలయం నుంచి భక్తులు ఆర్కేబీచ్‌కు తరలి వెళ్లారు. అక్కడ ప్రత్యక్ష దైవమైన సూర్యనారాయణమూర్తి ఆలయ అర్చకుడు కేశవాచార్యులు ఆధ్వర్యంలో పవిత్ర సముద్ర స్నానాలు ఆచరించారు. అనంతరం సూర్య నమస్కారాలు చేసి సూర్యనారాయణమూర్తికి అర్చకులు పంచహారతులు ఇచ్చారు. ప్రార్థనల అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.



రమా సహిత సత్యనారాయణస్వామి

సత్యదేవుని ఆలయానికి పోటెత్తిన భక్తులు

డాబాగార్డెన్స్ : నగరంలోని ఇసుకకొండ (బాబాజీ కొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం పౌర్ణమి ప్రత్యేక పూజలు పెద్ద ఎత్తున నిర్వహించారు. మాఘ పౌర్ణమి కావడంతో భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. నగరం నుంచే గాక జిల్లా నలు మూలలతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. వేకువజాము 4 గంటల నుంచే స్వామి దర్శనానికి భక్తులు బారులు తీరారు. ధ్వజస్తంభం వద్ద మహిళలు దీపారాధన చేశారు. అలాగే ఆలయం చుట్టూ గోవింద నామాలు స్మరిస్తూ ప్రదక్షిణలు చేశారు. భక్తుల తాకిడి ఎక్కువగా కనిపించింది. ఉచిత దర్శనంతో పాటు ప్రత్యేక టిక్కెట్ ద్వారా స్వామి దర్శనం కల్పించారు.



సామూహిక వ్రతాల్లో పాల్గొన్న వందలాది మంది భక్తులు

ధ్వజస్తంభ పూజ.. సామూహిక వ్రతాలు..

వేకువజాము 4 గంటలకు ధ్వజస్తంభ పూజ నిర్వహించారు. అధిక సంఖ్యలో సామూహిక వ్రతాలు జరిగాయి. అనివెట్టి మండపంలో కూడా ప్రత్యేక వ్రతాలు జరిపారు.

విస్తృత ఏర్పాట్లు..

భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా భద్రతా చర్యల కోసం అధిక సంఖ్యలో పోలీసులను నియమించారు. ఎక్కడికక్కడ షామియానాలు వేసి, మంచి నీటి సదుపాయం కల్పించారు. ఉచిత ప్రసాదం పంపిణీ చేశారు. ఆలయ ఈవో బుద్ధ మహాలక్ష్మి గణేష్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

27, 28 తేదీల్లో రేణుక యల్లమ్మ జాతర

అల్లిపురం: కెప్టెన్ రామారావు జంక్షన్‌లో వెలసిన రేణుక యల్లమ్మ అమ్మవారి 23వ జాతర మహోత్సవాలు ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో ఆలయ గౌరవాధ్యక్షుడు పీల వెంకట అప్పలనాయుడు అధ్యక్షతన కార్యవర్గ సభ్యులు సమావేశం నిర్వహించారు. కమిటీ ముఖ్య సలహాదారుగా వైఎస్సార్ సీపీ విశాఖ పార్లమెంట్ జిల్లా కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్‌ను నియమించారు. జాయింట్ సెక్రటరీగా బడే నాగరాజును నియమిస్తూ తీర్మానించారు. అనంతరం ఉత్సవ కమిటీ ఏర్పాట్లు, ఉత్సవాల నిర్వహణపై కమిటీ సభ్యులు చర్చించారు.

కర్రి నీలకంఠంకు సన్మానం..

జీవీఎంసీ 33, 34, 35, 41 వార్డులకు గాను వైఎస్సార్‌సీపీ తరఫున అధ్యక్షుడిగా నియమితుడైన రేణుక యల్లమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు కర్రి నీలకంఠంను పీల వెంకట అప్పలనాయుడు, కమిటీ సభ్యులు గజమాలతో సత్కరించారు.

యల్లమ్మతల్లికి మొక్కుల సమర్పణ..



కర్రి నీలకంఠాన్ని సత్కరిస్తున్న పీలా వెంకట అప్పలనాయుడు తదితరులు

రేణుక యల్లమ్మ జాతర సందర్భంగా విశాఖ వాసుల ఆరాధ్య దైవం యల్లమ్మతోట యల్లమ్మ వారికి ఉత్సవ సంకల్పాన్ని కమిటీ సభ్యులు తెలియజేశారు. అమ్మవారిని దర్శించుకుని పసుపు కుంకమలు సమర్పించి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బొడ్డు పోలరావు, వాసుపల్లి నారాయణ, పంపాన గణేష్, డి.సత్యనారాయణ, జి.సత్యవతి, ఆలయ అర్చకుడు కొడమంచిలి కామేశ్వరశర్మ పాల్గొన్నారు.

జ్ఞానాపురంలో అపారిశుధ్యం



రక్షణగిరికి వెళ్లే మార్గంలో పేరుకుపోయిన చెత్త



జ్ఞానాపురం బీఆర్‌టీఎస్ రహదారిలో ఇలా..

కంచరపాలెం: జ్ఞానాపురం పరిసరాల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. జోన్-5 జోనల్ కార్యాలయానికి ఆనుకుని ఉన్న బాబూకాలనీ, కొండవీధి, జేఎస్ఎన్‌యూఆర్‌ఎం కాలనీ, జ్ఞానాపురం బీఆర్‌టీఎస్ రహదారిలో సక్రమంగా చెత్త, మురుగు తొలగించకపోవడంతో దుర్గంధం అలుముకుంది. పాత లారీ యార్డ్ ప్రాంతంలో నెలల తరబడి వాహనాలను వదిలేయడంతో శానిటరీ సిబ్బంది వాహనాల కింద, ఆ చుట్టుపక్కల చెత్త పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారు. రక్షణగిరి సెయింట్ పీటర్స్ చర్చికి వెళ్లే మార్గంలో వుష్‌కార్ట్స్ తుప్పుపట్టడంతో చెత్తచెదారాలు రోడ్లపైనే పారబోస్తున్నారు. ఇటుగా వెళ్లే విద్యార్థులు, పాదచారులు ఇక్కడి దుర్గంధానికి ముక్కుమూసుకుని వెళ్లాల్సి వస్తుందని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెత్తాచెదారాలు తొలగించాలని పలువురు కోరుతున్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల అవగాహన సదస్సు

కంచరపాలెం: ఏపీఈపీడీసీఎల్ జోన్-2 డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి సోమవారం ఉదయం 10 గంటలకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు సీజీఆర్ఎఫ్ చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణ, సంస్థ జోన్-2 ఈఈ బి.కోటేశ్వరనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. కంచరపాలెం రామ్మూర్తి పంతులుపేట జోన్-2 ఏపీఈపీడీసీఎల్ డివిజన్ కార్యాలయంలో వేదికను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం, హెచ్చు తగ్గులు, బిల్లుల్లో సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, బిల్లుల్లో పేరు మార్పు, సరఫరా పునరుద్ధరణలో ఇబ్బందులు తదితర సమస్యలు పరిష్కరించనున్నట్లు తెలిపారు. వినియోగదారులు ఈ సదస్సులో పాల్గొనాలని కోరారు.

స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుందాం



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద దీక్షలో పాల్గొన్న వైజాగ్ చిల్డ్రన్ క్లబ్ చిన్నారులు

సీతమ్మధార: విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు అనే నినాదంతో ఎన్నో త్యాగాలు చేసిన సాధించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకుందామని వైజాగ్ చిల్డ్రన్ క్లబ్(వీసీసీ) వ్యవస్థాపకురాలు డాక్టర్ కొరెడ్ల రమాప్రభ అన్నారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణలో భాగంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరుగుతున్న నిరాహార దీక్షల్లో ఆదివారం క్లబ్‌కు చెందిన చిన్నారులు పాల్గొని.. సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ పట్ల కేంద్రం అన్యాయంగా వ్యవహరిస్తోందని.. ఈ బడ్జెట్‌లో నామమాత్రంగా కేటాయింపులు చేసిందన్నారు. ప్లాంట్ విస్తరణ, ఉపాధికి ఏ మాత్రం సహకరించడం లేదన్నారు. ప్లాంట్ లాభాల్లో నడుస్తున్న కేంద్రం అమ్మేయాలని చూస్తోందని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్ విషయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వీసీసీ నగర నాయకులు ఎల్లాజీ, సంతోష్, వేణు, అఖిల్, మానస, యువరాజు, ప్రదీప్, భార్గవ్, శ్రీనివాస్, గౌతమ్, శ్రావ్య మధులత, మోహన్, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు 70 మంది ఎంపిక



జాతీయ కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపికైన వారితో జానకీరామ్

మహారాణిపేట: న్యూఢిల్లీలోని తలకట్టోర ఇండోర్ స్టేడియంలో ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు జరిగే జాతీయస్థాయి కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌కు 70 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. న్యూ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఫిషింగ్ హార్బర్‌లో ఆదివారం ఎంపిక పోటీలు నిర్వహించారు. జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్రం నుంచి 70 మంది ఎంపిక కాగా.. ఇందులో 50 మంది విశాఖ క్రీడాకారులే కావడం విశేషం. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఏపీ మరపడవల సంఘం అధ్యక్షుడు వాసుపల్లి జానకిరామ్ పాల్గొని.. ఎంపికైన క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. దేశ రాజధానిలో పతకాలు సాధించి.. రాష్ట్ర ప్రతిష్టను మరింతగా ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. ఎంపిక పోటీలకు జి.నూకరాజు, డి.ప్రేమ్‌కుమార్, ఎస్.సతీష్ కుమార్, ఎస్.నరేష్, శంకర్, ఎర్రయ్య, శ్రీనివాస్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. కోచ్ జి.గోవింద్, టీమ్ మేనేజర్ చంద్రశేఖర్, అసోసియేషన్ ప్రెసిడెంట్ జి. నూకరాజు ఎంపికైన వారిని అభినందించారు.

స్పృహ తప్పిన వృద్ధుడికి సపర్యలు

అల్లిపురం: బస్టాప్‌లో స్పృహ తప్పిపోయిన వృద్ధుడికి మహారాణిపేట పోలీసులు చికిత్స అందించి.. కుటుంబ సభ్యులకు అప్పగించారు. సబ్బవరానికి చెందిన దివిలి శివరామ్(75) ఆదివారం సాయంత్రం జగదాంబ బస్టాప్ వద్ద స్పృహ తప్పి పడి ఉన్నాడు. అతన్ని మహారాణిపేట హెడ్ కానిస్టేబుల్ నాగరాజు గుర్తించి.. విషయాన్ని సీఐ రమణమూర్తి తెలియజేశారు. అతని ఆదేశాల మేరకు కేజీహెచ్‌కు తరలించి ప్రథమ చికిత్స అందజేశారు. అతని బ్యాగులో ఉన్న చిరునామా ప్రకారం సబ్బవరంలోని ఓ ఆలయంలో అర్చకుడిగా పనిచేస్తున్నట్లు గుర్తించారు. అతని కుమారుడు ఉమాపతికి సమాచారం ఇచ్చారు. ఆస్పత్రికి చేరుకున్న కుటుంబ సభ్యులకు వృద్ధుడిని అప్పగించారు.



వృద్ధుడిని అతని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష



పరీక్ష రాసి బయటికి వస్తున్న విద్యార్థులు

సీతమ్మధార: టీపీటీ కాలనీలోని ఎస్ఎంసీహెచ్ స్కూల్‌లో ఆదివారం 8వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన నేషనల్ మెరిట్-కమ్ మీన్స్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) టెస్ట్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగిన ఈ పరీక్షకు వివిధ పాఠశాలల నుంచి 240 మంది విద్యార్థులకు గానూ 229 మంది హాజరయ్యారు. డీఈవో చంద్రకళ పర్యవేక్షించారు. మాధవధార స్కూల్ హెచ్ఎం హే మలత, సిబ్బంది పాల్గొన్నారు.

మిగిసిన వైఎస్సార్ క్రికెట్ టోర్నమెంట్

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతం 13వ వార్డులో జరుగుతున్న వైఎస్సార్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. కార్పొరేటర్ కెల్ల సునీత ఆధ్వర్యంలో సుమారు రెండు వారాల పాటు ఈ పోటీలు జరిగాయి. నియోజకవర్గంలో 15 వార్డుల నుంచి 40 క్రికెట్ జట్లు ఈ టోర్నమెంట్‌లో తలపడ్డాయి. వాటిలో ఫైనల్‌కు చేరుకున్న కెల్ల ఎలెవన్ జట్టు, మద్దిలపాలెం ఎలెవన్స్ జట్టు ఆదివారం పోటీపడ్డాయి. కెల్ల ఎలెవన్ విజేతగా నిలిచింది. ఈ ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల పాల్గొని విజేత జట్టుకు ట్రోఫీ, రూ.30 వేలు నగదు అందజేశారు. రెండో స్థానంలో నిలిచిన మద్దిలపాలెం ఎలెవెన్ జట్టుకు రూ.20 వేలు, మూడో స్థానంలో నిలిచిన శ్రీకృష్ణాపురం టైగర్స్ జట్టుకు రూ.10 వేలు, నాలుగో స్థానంలో నిలిచి ఆర్‌కే బాయ్స్ జట్టుకు రూ.5 వేలు నగదు అందజేశారు. ఈ సందర్భంగా మేయర్, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ మాట్లాడుతూ యువతను ప్రోత్సహించే ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు అక్కరమాని రోహిణి, ముివ్వల లక్ష్మి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి మొల్లి అప్పారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు అక్కరమాని వెంకటరావు, కెల్ల సత్యనారాయణ, పలు వార్డుల నాయకులు పాల్గొన్నారు.



విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ విజయనిర్మల

పౌర గ్రంథాలయంలో ఆధ్యాత్మిక చిత్ర ప్రదర్శన

సీతంపేట: కళలకు ఆధ్యాత్మిక చింతన జోడిస్తే అది ఎంత గొప్పగానో నిలుస్తుందని ప్రముఖ ప్రవచన కర్త సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. ప్రముఖ ఆధ్యాత్మిక చిత్రకారిణి శ్రీలలిత టేకుమళ్ల వేసిన ఆధ్యాత్మిక 'లలిత లలితం' పేరిట పెయింటింగ్ చిత్ర ప్రదర్శనను ఆదివారం మధ్యాహ్నం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళలకు ఆధ్యాత్మికత జోడించడం గొప్ప విషయమని, లలితా టేకుమళ్ల పెయింటింగ్ ప్రదర్శన అద్భుతమని కొనియాడారు. కార్యక్రమంలో విశ్రాంత ఆచార్యులు వి.రమేష్, ఆచార్య టి.సుధాకర్‌రెడ్డి, ఆది కవి నన్నయ విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి కె.నిరుపమ రాణి, రామవరపు మాధురిదేవి, శంకర్ నీలు పాల్గొన్నారు.



పెయింటింగ్ ప్రదర్శనను ప్రారంభిస్తున్న సామవేదం షణ్ముఖశర్మ

'స్వరాజ్య స్ఫూర్తి @ 75' పుస్తకావిష్కరణ

సీతంపేట: స్వాతంత్ర్యోద్యమ చరిత్రను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని సీనియర్ పాత్రికేయుడు కె.శ్రీనివాస్ అన్నారు. రైటర్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగిన సభలో వెలుగు పక్షాన రామినాయుడు సంకలన పర్చిన 'స్వరాజ్య స్ఫూర్తి @ 75' అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. తొలి ప్రతిని గరిమెళ్ల మనవడు అశోక లక్ష్మణకు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమ చరిత్రను మర్చిపోతున్నామని, ఇటువంటి తరుణంలో ఈ పుస్తకం ఎంతో అవసరమన్నారు. రచయిత డి.వి.సూర్యారావు పుస్తకాన్ని సమీక్షించారు. కార్యక్రమంలో రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి.రమణమూర్తి, పౌర గ్రంథాలయ కార్యదర్శి డి.ఎస్.వర్మ, సీతామహాలక్ష్మి, రమాకాంత్, రామాంజనేయులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీనియర్ జర్నలిస్ట్ శ్రీనివాస్ తదితరులు

సీతమ్మధార రైతుబజార్‌లో సెల్‌ఫోన్ దొంగల హల్‌చల్



రైతుబజార్ ఈవో కొండబాబు అదుపులో ఇద్దరు సెల్‌ఫోన్ దొంగలు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లో సెల్‌ఫోన్ దొంగలు హల్‌చల్ చేశారు. ఆదివారం రైతుబజారు రద్దీగా ఉండటంతో అదే అదును చూసుకుని వినియోగదారులు కూరగాయలు కొనుగోలు చేస్తుంటే.. సెల్‌ఫోన్లు దొంగతనం చేశారు. దీంతో రైతుబజారు ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు, సహాయకుడు సతీష్ క్రైం పోలీసులకు సమాచారమివ్వడంతో వారు రంగంలోకి దిగారు. ఇద్దరు యువకులను సీసీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఘనంగా బల్లల పండగ

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు వెంకటరాజు నగర్‌లో శ్రీదుర్గా గణేష్ రజక సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం బల్లల పండగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో కార్పొరేటర్ ఆళ్ల లీలావతి, వైఎస్సార్‌సీపీ నేత ఆళ్ల శ్రీనివాస్ దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొని రజకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం స్థానికులకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బులుసు జగదీష్, సంఘ అధ్యక్షుడు ఎస్.మాధవ, సెక్రటరీ ఎస్.గణేష్, సీనియర్ నాయకులు వెంకటేష్, శ్రీనివాసరెడ్డి, సంఘ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



బల్లల పండగలో పాల్గొన్న కార్పొరేటర్ ఆళ్ల లీలావతి దంపతులు

ప్రాచీన భారతీయ వేద విజ్ఞానం ఆచరణాత్మకం

- బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ
- కొనసాగిన శ్రీసౌందర్యలహరి ప్రవచన మహోత్సవాలు

ఎంవీపీకాలనీ: భారతీయ ప్రాచీన వేదాలు అత్యంత సుస్థిర, ఆచరణాత్మకమైనవని బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. ఎంవీపీ కాలనీ సెక్టార్-6లోని ఏబీసీ పార్కులో నిర్వహిస్తున్న శ్రీశక్తి పంచాయతన యోగ పూర్వక శ్రీసౌందర్యలహరి ప్రవచన మహోత్సవాలు ఆదివారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ ప్రాచీన వేదాల్లో సుస్థిరమైన విజ్ఞానం దాగి ఉందన్నారు. నేటి ఆధునిక యుగంలోని శాస్త్రవేత్తలు సైతం దీన్ని ధ్రువీకరించడం అభినందనీయమన్నారు. దాన్ని వెలికి తీసి పాటించడం ద్వారా ప్రశాంతమైన జీవనం సాధ్యమవుతుందన్నారు. వేదాల విజ్ఞానం ఆధునిక సమాజానికి సైతం మార్గదర్శకంగా నిలుస్తుందని చెప్పారు. కేవీఎస్ శ్యామ్, అరుణగాయత్రి దంపతుల నేతృత్వంలో నిర్వాకులు వీవీ ఆదినారాయణ, దొంతకుర్తి శ్రీనివాస్‌లు యాగాది క్రతువులు, ప్రత్యేక విశేష పూజలు నిర్వహించారు. ఈ నెల 12వ తేదీ వరకు సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు ఈ ప్రవచనాలతో పాటు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలను జరుగుతాయని శ్రీమాత భక్త బృందం సభ్యులు తెలిపారు. ఈ ప్రవచనాల కార్యక్రమంలో 1000 మందికి పైగా నగర భక్తులు పాల్గొన్నారు.



ప్రవచిస్తున్న సామవేదం షణ్ముఖశర్మ

ప్రైవేటు స్కూల్స్ హెచ్‌ఎంల ఆత్మీయ కలయిక

కంచరపాలెం: ఏపీ ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జె.సోమశేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం కంబాల కొండలో ప్రైవేటు స్కూళ్ల హెచ్‌ఎంలు, కరస్పాండెంట్లు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ప్రైవేటు స్కూళ్ల ఐక్యతను బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ ఏడాదిలో అత్యధిక పాఠశాలలు సభ్యత్వ నమోదుకు ముందుకు రావాలని సోమశేఖర్ కోరారు. మధ్యాహ్నం విందు, వినోదాలతో నూతన ఏడాది సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో జిల్లాలోని ప్రైవేటు స్కూళ్ల సభ్యులు పాల్గొన్నారు.